


# సంఘసేవ!

-జి.దుర్గ

'మూర్తిగారూ నేను చెప్పిన విషయం ఏం చేశారు?' అంటూ కనపడ్డప్పుడల్లా అడుగుతుంది రేఖ.

మూర్తి నవ్వి వూరుకుంటాడు. మూర్తి ఫ్రెండు రవీంద్ర భార్య రేఖ. మనిషి చక్కగా సన్నగా పొడుగ్గా అందంగా ఎప్పుడూ జరీచీరలతో కనపడుతూ వుంటుంది. రవీంద్ర, మూర్తి యిద్దరూ వొకే ఆఫీసులో వుద్యోగం. అయితే సెక్షన్సువేరు. పని వొత్తిడివల్ల ఎక్కువ మాట్లాడు కోటానికి కుదరదు..ఎప్పుడయినా కొంచెం టైము దొరికితే ఆఫీసు విషయాలు తప్ప పర్సనల్‌వి వుండవు.

రేఖ రోజూ మహిళా మండలికి వెడుతూ వుంటుంది. ఏదైనా కాలక్షేపానికి పుస్తకాలు తెచ్చుకోటం, మీటింగులకి అటెండవటం, అగ్ని బాధితులకి, వరద బాధితులకి పాత బట్టలు, చందాలు కలెక్టుచేసి యివ్వడం, ఎక్కడయినా ప్రమాదం జరిగితే వెంటనే హాజరయి వివరాలు సేకరించి మీటింగులు ఏర్పాటుచేసి ఏం చెయ్యాలో నిర్ణయాలు తీసుకోటం, అలా మహిళా మండలిలో కూడా ప్రముఖ స్థానాన్ని సంపాదించేసింది. అన్ని చోట్లా నేనున్నానంటూ వ్యవహరిస్తూ వుంటుంది.

మూర్తి కనపడ్డప్పుడల్లా అతని భార్య లక్ష్మిని కూడా మహిళా మండలిలో చేర్పించమని పోరు పెడుతూ వుంటుంది. యింటికి రావటం తక్కువ కానీ వొచ్చినప్పుడూ చందాలనీ, అగ్ని ప్రమాదాలకి గురయిన వాళ్ళకి బట్టలు అవీ తీసికెడుతూ వుంటుంది.

రేఖ అడిగినప్పుడల్లా మూర్తికి ఏం సమాధానం చెప్పాలో తెలీక 'చెబుతాలెండి' అని నవ్వి వూరుకుంటాడు. మూర్తికి నాటకాలన్నా సోషల్ వర్కన్నా కూడా యిష్టమే. లక్ష్మి ఎప్పుడూ యింట్లోనే వుంటుంది. కానీ బయటకి వెళ్ళదని విసుక్కున్న సందర్భాలు కూడా ఉన్నాయి. "నువ్వు కూడా రవీంద్రగారి భార్యలాగా మహిళా మండలిలో చేరచ్చు కదా? ఎప్పుడూ యిల్లే కైలాసమని కూచుంటే ఎలా? ఆవిడ చూడు యింట్లో పని చేసుకుని బయట ఎంత సోషల్ వర్కు చేస్తోందో. బయట ప్రపంచం కూడా చూడాలి...అందుకు"

లక్ష్మి నవ్వుతూ– 'యింట్లో పని చూస్తున్నారు కదా. పిల్లలిద్దరినీ రెడీ చేసి టిఫిన్ బాక్సులు సర్దాలా? యివన్నీ చేసుకుని సంఘసేవ చేసుకునే వోపికలేదు. అయినా వాళ్ళందరూ బాగా చదువుకున్న వాళ్ళు బాబూ. అక్కడ నాకు ఎలా వుండాలో తెలీదు' అంటూ తీసి పారేసింది.

"ఏదయినా మనిషికి బయట ప్రపంచంలో కూడా గుర్తింపు వుండాలి–"

'నాకు యింట్లో వున్న గుర్తింపు చాల్లెండి'

మూర్తికి లోలోపల అసంతృప్తి పెరిగిపోతోంది. తన భార్య కూడా రేఖలాగా జరీ చీరలు కట్టుకుని సంఘసేవ చేస్తుంటే చూసి ఆనందించాలని వుంటుంది. కానీ లక్ష్మి వినదు. వొట్టి 'మొద్దావతారం' అని తిట్టుకుంటాడు కూడా.

వొక వేసవికాలంలో వూరి చివర పాకలు అంటుకుపోయాయి. రేఖ నాలుగు రోజులు మహిళామండలి సభ్యులతోవెళ్ళి వాళ్ళని పరామర్శించి వొచ్చింది. చందాలు, బట్టలు సేకరించటం మొదలుపెట్టింది. ఒకరోజు మూర్తి యింటికి కూడా వచ్చింది. మూర్తి ఆవిడ యింటికి రాగానే ఎంతో సంతోషంగా కంగారుగా ఆహ్వానించాడు. ఆవిడ ముందు ఎంతో గొప్పగా 'అబ్బా! పాత బట్టలా చాలా వున్నాయి' అంటూ లోపలికి వెళ్ళాడు లక్ష్మితో చెప్పటానికి.

"ఏవో బట్టలిచ్చి పంపించు బాగుండదు' అన్నాడు.

'అన్నీ మంచివేనండీ. మొన్నీమధ్య కదా యిచ్చాం. అన్నీ ఆ బాధితులకిస్తే మనకేవీ వుండవు" అంది లక్ష్మి.

'ఛీ ఆవిడ యింటి కొచ్చి అడిగింది. లేవంటే ఏం బాగుంటుంది' అంటూ లక్ష్మిది మంచి గట్టి చీర, రెండు పాత దుప్పట్లు యిచ్చాడు.

అవి చూడగానే రేఖ మొహం విప్పారింది.

'థాంక్స్ మూర్తిగారూ. లక్ష్మిగారిని కూడా అందుకే చేర్పించమంటున్నా ఏమంటారు?' అంది కాఫీ తాగుతూ.

'నాకంత వీలుకాదండీ–' అంది లక్ష్మి మెల్లగా.

'అంటే రోజంతా యింటి పనేనన్నమాట. మన మహిళలు ఎప్పుడూ యింటి పని వంటపని అనుకుంటే ఎలాగండీ. సంఘసేవ కూడా చేసి గుర్తింపు పొందాలి...' అంటూ కొంచెం సేపు చెప్పి బట్టలు తీసికెళ్ళి పోయింది రేఖ.

'అబ్బ నాకావిడ ముందు చాలా అవమానంగా వుంది. ఆ మహిళా మండలిలో ఏదో చేరి, పోనీ తర్వాత మానెయ్యరాదూ?' కసిరినట్లుగానే అన్నాడు మూర్తి.

లక్ష్మి ఏమీ చెప్పకుండా కాఫీ కప్పు లోపల పెట్టేసి 'అయినా బంగారంలాంటి చీర యిచ్చేశారు. యింకా సంవత్సరంపాటు కట్టేదాన్నే' అంది.

'మరేం ఫర్వాలేదులే. అడిగిన విషయం తప్ప అన్నీ మాట్లాడతావు' రోజులు గడుస్తున్నా మూర్తి లక్ష్మిని సతాయించటం మానలేదు. వొకసారయితే ఘర్షణపడ్డారు కూడా.

రవీంద్ర రెండు రోజులుగా ఆఫీసుకి రావటంలేదు. మూర్తికి ఎందుకో అర్థం కాలేదు. పోనీ యింటికెళ్ళేటప్పుడు చూసి వెళ్ళాలని అనుకుని కొంచెం త్వరగా ఆఫీసునించి బయట పడ్డాడు. దారిలో మహిళా మండలి కనపడింది. లైట్ల వెలుగులో చాలా అందంగా వుంది. బయట రంగు కాగితాలు అలంకరించారు. మహిళా మండలి వార్షికోత్సవాలు అన్న బోర్డు కూడా కనపడింది. చాలా మంది వలంటీర్స్ కనపడ్డారు.

లోపలికి అడుగుపెట్టాడు మూర్తి. లోపల ఆడిటోరియంలో చాలా కోలాహలంగా వుంది. వేదిక మీద వుపన్యాసాలు జరుగుతున్నట్టున్నాయి. అందరూ ఎంతో ఖరీదయిన పట్టు చీరలు కట్టుకు కూచున్నారు.

మూర్తి ఒక కుర్చీ చూసుకు కూచున్నాడు.

'ఇల్లాలు - కర్తవ్యాలు' గురించి రేఖ ఉపన్యాసం యిస్తోంది. ఎర్రటి జరీచీర, చుట్ట చుట్టుకుని మల్లెపూలు పెట్టుకుని ఎంతో హుందాగా వుపన్యాసం చెబుతోంది. ఆమె కంఠం ఖంగున వినపడుతోంది. వినేవాళ్ళు ఎంతో ముగ్ధులవుతున్నారు. తను ఎంతో పొద్దున్నే లేచి ఇల్లంతా శుభ్రం చేసి స్నానంచేసి దేవుడి పూజచేసి భర్తకి పిల్లలకి కావల్సినవి అమర్చి విరామ సమయాల్లో మహిళా మండలకొస్తానని, తనకి ముందు యిల్లు, భర్త పిల్లలు ముఖ్యమని తర్వాత బయట ప్రపంచమని నొక్కి చెబుతోంది రేఖ.

మూర్తి కూడా మెచ్చుకోకుండా వుండలేకపోయాడు. రవీంద్ర అదృష్టవంతుడు అనుకున్నాడు. యింకా వుపన్యాసాలు వుండగానే బయటికొచ్చి రవీంద్ర యింటి తలుపు తట్టాడు.

తలుపు తట్టిన అయిదు నిమిషాలకి తలుపు తీశాడు రవీంద్ర.

వొక్క క్షణం తెల్లబోయి 'రండి' అన్నాడు రవీంద్ర గడ్డం మాసి నీరసంగా కనపడుతున్నాడు.

"ఏవిటలా వున్నారు? రెండు రోజుల్నించీ ఆఫీసుకి రాకపోతే కనుక్కుందామని..." అన్నాడు మూర్తి.

"నాకూ మా అబ్బాయికి కూడా రెండు రోజుల్నించీ జ్వరం. అందుకే లీవ్ పెట్టాను-"

యిల్లంతా వూడ్చి ఎన్నాళ్ళయిందో దుమ్ము పేరుకుపోయి వుంది. పుస్తకాలన్నీ చిందర వందరగా వున్నాయి. ఎక్కడ చూసినా బట్టల మూటలు. బహుశా అగ్ని బాధితులకి యింకా అందజెయ్యలేదేమో.

'మా అబ్బాయికి తగ్గగానే నాకొచ్చింది యివాళ వాడికి కూడా పూర్తిగా రిలీఫ్ రాలేదు. వాడి కోసమనే నా శలవ్....'

'మరి రేఖగారు-' అడగాలో వొద్దో తెలీక ఆపేశాడు మూర్తి.

'ఆవిడా- ఆవిడికి మహిళా మండలి వుంటే చాలు. యింకే అక్కర్లేదు. వాడికి జ్వరమని చెప్పినా ఏవో వార్షికోత్సవాలుట చీకటి మొహాన జ్వరం పిల్లాడిని యింటినీ నాకు వొదిలేసి వెళ్ళిపోయింది. మీకు తెలిసే వుంటుందేమోగా-' అతను అక్కసుగా చెబుతుంటే ఆశ్చర్యంగా వింటున్నాడు మూర్తి.

'కూచోండి యిప్పుడే వొస్తాను.' అంటూ వంటింట్లోకి వెళ్ళాడు రవీంద్ర.

మూర్తి వంటింట్లో డైనింగ్ టేబుల్ కనపడుతుంటే చూశాడు. టేబులంతా కంచాలు- ఎప్పుడు తిన్నవో వాటి చుట్టూ చీమలు- వొక విధమైన వాసన వస్తోంది.

'బాబూ ఎలా వుంది?' అడిగాడు రవీంద్ర కొడుకుని.

వాడు తల వూపాడు ఫరవాలేదన్నట్లు.

అక్కడ బట్టల మూటల్లో వొకదానికి లక్ష్మి చీర కట్టి వుంది. వొద్దంటుంటే బలవంతాన యిప్పించిన చీర.

'బాబూ ఆ మూటలన్నీ ఏం చేస్తారు?'' మామూలుగా అడిగినట్లు అడిగాడు.

'అవన్నీ అమ్మ పంచి పెడుతుంది బీదవాళ్ళకి. ఈ సారి అందులో మంచి చీరలు ఏరలేదు. అందుకని పంచిపెట్టలా...'

'ఏరటం దేనికి?'

"అమ్మ మంచి చీరలు వుంచి స్టీలు సామాను కొంటుందిగా" అదేదో మామూలు విషయంలా చెప్పాడు.

తెల్లబోయాడు మూర్తి.

"డాడీ వొద్దంటారు- అయినా అమ్మ వినదు పోట్లాడుతుంది. ఈ మహిళా మండలికి తిరగటం అసలు బయట కెళ్ళటమే నాన్న కిష్టం లేదు.''

రవీంద్ర ఎప్పుడూ ఆఫీసునించి యింటికి ఆలశ్యంగా ఎందుకెడతాడో అసలు యింటికి వెళ్ళటానికి ఎందుకు యిష్టపడడో కూడా అర్థమయింది. ఎప్పుడూ యింటి పట్టున వుండదాయే. యిల్లీ విధంగా వుండి యిల్లాలు యింట్లో లేకపోతే ఏ మగాడు యింటికొస్తాడు?

రవీంద్ర కాఫీ తెచ్చాడు.

'అరే. ఈ టైములో కాఫీ ఎందుకండీ-' నొచ్చుకుంటూనే పుచ్చుకున్నాడు మూర్తి.

'వొంట్లో బాగాలేదన్నారు మరి ఏం తీసుకొన్నారు?'

'బ్రెడ్ వుందిలెండి. యివాళ్టికి పడుకుంటే తెల్లారికి తగ్గిపోతుంది.'

'పాపం మీకు వొంట్లో బాగా లేదు- రేఖగారు వచ్చేసరికి బాగా లేటవుతుందేమో కూడా-'

'పోన్లెండి. నాకలవాటయిపోయింది. యివాళ కొత్తేం కాదు. అయినా యింటిని బాగు చేసుకోలేని వాళ్ళకి సమాజం బాగుదేనికండీ నాకు తెలీకడుగుతాను. మీ వాళ్ళని పొరపాటున కూడా చేర్పించకండి- వొకసారి చేరారంటే వాళ్ళ యిక వదల్లేరు. మనకి నెలలో యిరవై రోజులు వంట పని తప్పదు' ఎన్నాళ్ళో దాచి పెట్టుకున్నది బయటపెడుతున్నట్లు ఆవేశంగా అన్నాడు రవీంద్ర.

"నిజమే!''

'యింటి కొచ్చేసరికి హాయిగా వుండాలిగానీ మా యింట్లో చూడండి. ఆ డ్రాయింగ్ రూంలో మూటలు చూడండి చాకలాళ్ళ కొంపలాగా. ఏమన్నా అంటే పోట్లాడుతుంది. పైగా యివాళ 'యిల్లాలు- పరిశుభ్రత' గురించి వుపన్యాసాలట. బహుశా ఫస్టు ప్రైజు సంపాదించుకొస్తుంది చూడండి. యింట్లో నేను శుభ్రం చేస్తే తను లెక్చరిచ్చి వొస్తుందన్నమాట' మూర్తికి యిక అక్కడ కూచుంటే బాగుండదనిపించింది.

'ఎన్నయినా చెప్పండి మూర్తిగారూ ప్రతి వాళ్ళూ సమాన హక్కులు అని గొడవచేస్తూ వుంటారు. కానీ అది అనవసరమైన గొడవలే అనుకుంటాను. రేఖ చూడండి. జ్వరం పేలిపోతుంటే వాడిని నా మీద వొదిలేసి చక్కా వెళ్ళిపోయింది. నిజంగా వొళ్ళు మండిపోతోంది తలుచుకుంటే-'

'పోన్లెండి ఏదో అవసరం కొద్దీ వెళ్ళుంటారు. ఫంక్షన్సు వుంటే యింటి పనికి బయట పనికి కూడా కుదరదులెండి. కొన్ని కొన్ని మనం కూడా ఆలోచించి వొదిలేయ్యాలి- అంతే' నవ్వుతూ అన్నాడు మూర్తి.

'ఎప్పుడో వొకసారయితే నేను యిలా బాధపడుతూ మీరు రాగానే చెప్పేవాడినా మూర్తిగారూ ఎన్నాళ్ళ నుంచో విసిగిపోయాను. ఎప్పుడూ సోషల్ వర్కంటుంది. ఖరీదయిన చీరలు కట్టుకుని రోడ్లూడుస్తున్నట్లు ఫోటో దిగితే గొప్ప. యింట్లో చీపురు పట్టుకుని యిల్లు శుభ్రం చేసుకున్న పాపాన పోదు. ఈ మహిళలందరూ కూచుని చెప్పుకునే కబుర్లేమిటో తెలుసా? చీరలు, నగలు, సినిమాలు, స్టీలు సామాను. వీటిని మించి మాట్లాడుకోరు. ఎవరు ఎన్ని సినిమాలు చూస్తే అంత గొప్ప. వొకళ్ళు కొత్త చీర కొనుక్కోగానే మిగిలినవాళ్ళు అంతకన్నా ఎక్కువ ఖరీదులో కొనేసి తమ ఆధిక్యత చాటు కోవాలి. కొట్లో కొత్తరకం స్టీలు గిన్నె వస్తే అది యింట్లోకి వచ్చెయ్యాలి. నిజంగా సంఘసేవ ఎవరూ చేయరా అంటారేమో. చేసేవాళ్ళు చాలామంది వున్నారు. అలాంటి వారికి ఆర్భాటాలు అట్టహాసాలు అనవసరం."

రవీంద్ర చాలా నెమ్మది మనిషి. ఎప్పుడూ ఏ విషయం చెప్పడు. గుట్టుగా వుంటాడు. అటువంటిది యివాళ ప్రవాహం లాగా చెప్పుకొచ్చాడంటే మూర్తికి కూడా చాలా బాధకలిగింది.

'మా యింటికి రండి- బాబుకి కూడా బాగా లేదు కదా-' అన్నాడు.

'వొద్దండీ- రేపు మళ్ళీ ఆఫీసు కెళ్ళాలి. అయినా కొంచెం తగ్గింది ఫరవాలేదు-'

మరో పది నిమిషాలు వుండి మూర్తి లేచి బయటికొచ్చాడు. యింకా మహిళా మండలి నించి కోలాహలం వినపడుతూనే వుంది. కొన్ని మహిళామండలు నిజంగా సమాజసేవ చేసేవీ వుంటాయి. వీటివల్ల వాటికీ చెడ్డపేరు. యింటి కొచ్చే దారిలో అనుకున్నాడు మూర్తి. 'నయమే లక్ష్మిని ఆ మహిళా మండలిలో చేరమని పోరుపెట్టాడు. అదృష్టం చేరలేదు. తను నాటకాల్లో తిరిగి లక్ష్మి మహిళా మండలిలో తిరిగితే యిల్లు గాలికొదిలెయ్యాలి. భార్యా భర్తల్లో వొకరి అభిరుచి మరొకరికి లేకపోవటం కూడా దేవుడు చేసే అద్భుతాల్లో వొకటేమో. 'యిల్లే కదా స్వర్గసీమ' అనుకుంటూ అద్దంలా వున్న యింట్లో అడుగు పెట్టాడు మూర్తి.